ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
శుక్రవారం 29 ఆగస్టు 2025





మల్లన్న ఆలయ పాలకమండలి కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న ఆలయాధికారులు

వేలంలో 'మల్లన్న'కు రూ.కోటి ఆదాయం

కొమురవెల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో తలానీలాలు పోగు చేసే లైసెన్స్ కోసం ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ అధ్వర్యంలో ఈ-టెండర్, సీల్డ్‌టెండర్, బహిరంగ వేలం పాటను గురువారం నిర్వహించారు. మొత్తం 13 మంది వేలం పాల్గొన్నారు. ఇందులో రుద్ర ఎంటర్‌ప్రైజెస్ సిద్దిపేట వారు హెచ్చుపాడి రూ.1,01,01,116 కు సంవత్సరకాలానికి టెండర్ దక్కించుకున్నారు. ఆలయ చరిత్రలో తలానీలాలు పోగు చేసే లైసెన్స్‌కు వేలం పాటలో ఇంతటి పాట రావడం ఇదే మొదటిసారి. గతేడాది కంటే సుమారు రూ.38,64,116 అధికంగా వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు. వేదికపైన కూర్చున్న ధర్మకర్త వల్లాద్రి అంజిరెడ్డి ఒకరికి లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నదంటూ వేలంలో పాల్గొన్న పలువురు సభ్యులు వాగ్వాదానికి దిగారు. టెండర్ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆలయ ఈవో, అధికారులు, ధర్మకర్తలు టెండర్‌దారులతో మాట్లాడి వారిని సముదాయించి వేలం సజావుగా కొనసాగించారు. కార్యక్రమంలో దేవదాయ సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఏఈవో శ్రీనివాస్, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్,మోహన్ రెడ్డి, వల్లాద్రి అంజిరెడ్డి పాల్గొన్నారు.

పనిచేయమంటే..
ఆరోపణలు చేస్తున్నారు
● గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ 6



తొగుటలో వర్షంలో గొడుగులు పట్టుకుని యూరియా కోసం క్యూకట్టిన రైతులు

వర్షంలో సైతం..
● యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు 7

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వినాయకచవితి

సంగారెడ్డి రామ్‌మందిర్ గణపతి మండపంలో భజన, పూజలు

సంగారెడ్డి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని రామ్‌మందిర్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వయంగా భజన మండలి సభ్యులతో కలిసి ఆయన భక్తి గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. పూజల్లో జగ్గారెడ్డి సతీమణి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, కూతురు జయారెడ్డి, అల్లుడు గుణచైతన్యరెడ్డి, కొడుకు దత్తుసాయి రెడ్డి, రామ్‌మందిర్ భజన మండలి సభ్యులు, పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





సంగారెడ్డి రామ్‌మందిర్ గణపతి వద్ద కుటుంబ సభ్యులతో జగ్గారెడ్డి, రామ్‌మందిర్ భజన మండలి సభ్యులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



వరదనీటిలో సిద్దిపేటలోని పలు కాలనీలు

జల దిగ్బంధం

● తడిసి ముద్దయిన సిద్దిపేట జిల్లా
● గరిష్ఠంగా 20.7 సెం.మీ వర్షపాతం

గతంలో ఎన్నడూ లేనంతగా సిద్దిపేట జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న అతి భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. జిల్లాలోని చెరువులు, చెక్‌డ్యామ్‌లు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పైప్రాంతాల నుంచి ఉధృతంగా వస్తున్న వరద నీరు సిద్దిపేటలోని లోతట్టు ప్రాంతాలు, పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. జిల్లాలో అత్యధికంగా కొమురవెల్లి మండలంలో గరిష్టంగా 20.7 సెం.మీ వర్షపాతం నమోదు కాగా, మరో ఎనిమిది మండలాల్లోనూ భారీ వర్షాలు నమోదయ్యాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేయడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

- సిద్దిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి)

- పొంగిపొర్లుతున్న చెరువులు, చెక్‌డ్యామ్‌లు
- 7 వేల ఎకరాలకు పైగా మునిగిన పంటలు
- రోడ్లు, పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయం
- రంగంలోకి దిగిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం
- పలు ప్రాంతాల్లో రాకపోకలు బంద్
- పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్ హైమావతి, సీపీ అనురాధ, మాజీ మంత్రి హరీశ్‌రావు, నాయకులు
- ఆరెంజ్ అలర్ట్ జారీ

మరో రెండు రోజులు భారీ వర్షాలు



నీటమునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి, సీపీ అనురాధ



పట్టణంలోని భావిస్‌ఖాన్ పూల్ కెనాల్ వద్ద వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



వరదనీటిలో చిక్కుకున్న దంపతులను రక్షించిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు

భారీగా వస్తున్న వరద నీటితో సిద్దిపేట పట్టణంలోని కోమటిచెరువు ఉధృతంగా పొంగిపొర్లుతోంది. పలు లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సిద్దిపేటలోని శ్రీనగర్ కాలనీ, శ్రీనివాసనగర్‌లో నడుము లోతు వరకు వరద నీరు నిలవడంతో ఓ దంపతులను ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం రక్షించింది. కోమటిచెరువు వరదనీరు పాత బస్టాండ్ నుంచి బావిస్‌ఖాన్ పూల్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు నిలిచిపోయింది.

మునిగిన పంటలు

భారీ వర్షాల కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికే యూరియా కొరతతో అష్టకష్టాలు పడుతున్న రైతన్నలు తాజా వర్షాలతో లబోదిబోమంటున్నారు. జిల్లాలో 7వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలు నీట మునిగాయి. మునిగిన పంట వివరాలను సేకరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

పర్యటించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

పట్టణంలో కోమటిచెరువు ప్రాంతాన్ని, బావిస్‌ఖాన్ పూల్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు సందర్శించారు. చెరువు ఉధృతి తగ్గేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. నర్సాపూర్ చెరువు కట్టపై భాగాన్ని తొలగించడంతో వరద నీరు తగ్గింది. పట్టణంలో వరదలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్షిస్తానని తెలిపారు.

రాకపోకలు నిలిపివేత, కూలిన ఇళ్లు

వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పోలీసులు, అధికారులు పలు ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. సిద్దిపేటలో పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు రాకపోకలు నిలిపివేశారు. నంగునూరు, ఘనపూర్ గ్రామాల మధ్య, కొండపాక నుంచి జప్తినాచారం రోడ్డు మధ్య, దుద్దెడ, అంకిరెడ్డిపల్లి గ్రామాల మధ్య, చేర్యాల మండలం తాడురు వాగు మధ్య, సిద్దిపేట రూరల్ మండలంలో పలు గ్రామాల మధ్య రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలను నిలిపివేశారు. మర్కూక్ మండలం ఎర్రవెల్లిలో వైకుంఠధామం నీట మునగడంతో కుటుంబసభ్యులు రోడ్డుపైనే దహన కార్యక్రమాలు నిర్వహించారు.

పర్యటించిన కలెక్టర్, సీపీ

సిద్దిపేట క్రైం: జిల్లా కేంద్రంలో నీట మునిగిన పలు కాలనీలను కలెక్టర్ హైమావతి, సీపీ అనురాధతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్త బస్టాండ్ నుంచి మోడ్రన్ బస్టాండ్ మధ్యలో రోడ్డు వెంబడి బ్రిడ్జి పైన నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించి నీటి ఉధృతి తగ్గేవరకు రాకపోకలు నిలిపివేయాలని, పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నర్సాపూర్ చెరువు మత్తడి ప్రాంతాన్ని పరిశీలించి నీరు వేగంగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.



కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల శివారులోని పత్తిచేనులోకి చేరిన వరదనీరు

మరో రెండు రోజులు వర్షాలు

మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీపీ తెలిపారు. వినాయక మండపాలు నిర్వహించే కార్యవర్గ సభ్యులు కరెంట్ విషయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కరెంటు స్తంభాలను ఎవరూ తాకకూడదన్నారు. వర్షాల వల్ల ఏదైనా విపత్కర సమస్య వస్తే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూం వాట్సప్ నంబర్ 8712667100కు సమాచారం అందించాలని సూచించారు.

రంగంలోకి రాష్ట్ర ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, రాష్ట్ర ఎస్‌డీఆర్‌ఎఫ్ 8వ బెటాలియన్ బృందాలతో కలిసి జలమయమైన కాలనీలను సందర్శించారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే డయల్ 100కు ఫోన్ చేయాలని ఏసీపీ రవీందర్ తెలిపారు. గోశాలలోని గోవులను సంబంధిత నిర్వాహకులతో కలిసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



వరద నీటిలో వెళ్తున్న బస్సు

ఆయా మండలాల్లో..

చిన్నకోడూరు/చేర్యాల/నంగునూరు/మిరుదొడ్డి/కోహెడ/తొగుట/రాయపోల్/మర్కూక్: చిన్నకోడూరు మండలం రామునిపట్ల నుంచి గోనెపల్లికి వెళ్లే మార్గంలో లోలెవల్ వంతెన పైనుంచి వాగు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గురువారం ఆ రెండు గ్రామాల మధ్య మండల రాకపోకలను నిలిపివేశారు. వరదనీరు కుడిచెరువులోకి వెళ్లే నాలాల ఆక్రమణలతో పాటు కల్వర్టుల మూసివేతల కారణంగా చేర్యాల ఆర్టీసీ బస్టాండ్, కడవేరుగుదారి సమీప పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. ఓక్లే

మిగతా వార్త 8వ పేజీలో,
మరిన్ని ఫొటోలు 7లో..

మండలం	వర్షపాతం మి.మీలో
కొమురవెల్లి	207.3
కొండపాక	192.8
గజ్వేల్	185.8
తొగుట	168.3
చేర్యాల	158.8
జగదేవ్‌పూర్	158.5
మర్కూక్	144.5
సిద్దిపేట రూరల్	141.5
కుకునూర్‌పల్లి	126.3
బెజ్జంకి	103.0
సిద్దిపేట అర్బన్	100.5
కోహెడ	96.8
రాయపోల్	90.8
దౌల్తాబాద్	77.3
దుబ్బాక	77.3
అక్బర్‌పేట-భూంపల్లి	70.3
ములుగు	69.8
నారాయణరావుపేట	63.5
నంగునూర్	54.0
ధూలిమిట్ట	50.8
మిరుదొడ్డి	48.0
హుస్నాబాద్	46.3
వర్గల్	46.0
చిన్నకోడూర్	42.5
మద్దూర్	34.0
అక్కన్నపేట	33.8



సిద్దిపేటలోని పటేల్‌పురలో శ్రీపార్వతీమాత అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు

కొలువుదీరిన గణనాథులు

ఓ వైపు భారీ వర్షం కురుస్తున్నా.. జిల్లావ్యాప్తంగా బుధవారం వినాయక చవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలో గురువారం వరకు 2513 మండపాల కోసం అనుమతులు వచ్చాయి. మరికొన్ని పెరిగే అవకాశం ఉందని పోలీస్ అధికారులు తెలిపారు. - వార్త 8లో..

శేరిపల్లి పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు



బి.రవి, ఉపాధ్యాయుడు

దౌల్తాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలంలోని శేరిపల్లి ప్రాథమిక పాఠశాల రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. తల్లిదండ్రులను పాఠశాల కార్యకలాపాల్లో సులభంగా భాగస్వాములను చేయడంపై ఉపాధ్యాయుడు బి.రవి రాసిన వ్యాసం రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ప్రచురించిన "ట్రయల్స్ బ్లేజర్స్" పుస్తకంలో చోటు దక్కించుకుంది. ఈ పుస్తకంలో పేజీ నంబర్ 277-281 వరకు రవి వినూత్న బోధనా పద్ధతుల గురించి వివరించారు.

ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి గురువారం మాట్లాడుతూ.. రవి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, షెహనాజ్ బేగం వంటి ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతోనే ఈ గుర్తింపు సాధ్యమైందని తెలిపారు. ఇటీవల బదిలీపై కోహెడ మండలం పెరుకలగడ్డకు వెళ్లిన ఉపాధ్యాయుడు రవి మాట్లాడుతూ.. తాను ఏ పాఠశాలలో పనిచేసినా విద్యార్థుల పురోగతికి, విద్యాభివృద్ధికి వినూత్న పద్ధతుల్లో కృషి చేస్తానని చెప్పారు. శేరిపల్లి పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.







తల్లీకుమార్తె అదృశ్యం


సంగీత(ఫైల్)

పటాన్‌చెరు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి తల్లీ, కుమార్తె అదృశ్యమయ్యారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లాపూర్ మున్సిపల్ పరిధి ముత్తంగి గ్రామంలో రమేష్ భార్య సంగీత, రెండేళ్ల కుమార్తె నయనలతో ఉంటూ చెత్తబండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 24న సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి భార్య, కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో విచారించినా ఫలితం లేదు. భర్త రమేష్ ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.







పాఠశాలలను తనిఖీ చేయాలి : కలెక్టర్


సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను విధిగా తనిఖీ చేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలను తనిఖీలు చేయడమే కాకుండా ఆ వివరాలను స్కూల్ ఎడ్యుకేషన్ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముఖ గుర్తింపు హాజరులలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కరెంట్, మరుగుదొడ్లు, తాగునీరు తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలో కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీలో నిర్దేశించిన కార్యక్రమాలను సమయానుసారంగా పూర్తి చేయాలని సూచించారు. 59 పూర్వ ప్రాథమిక పాఠశాలల మంజూరును దృష్టిలో పెట్టుకుని అన్ని బడుల్లో ఆ విద్యార్థులకు అవసరమైన వాతావరణాన్ని కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనంలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్లు పంపిణీ చేసేలా ప్రధానోపాధ్యాయులు చూసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి నెల క్రమం తప్పకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి ప్రణాళిక రూపొందించి పాఠశాల పరిస్థితులు, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, వారి ప్రగతి ప్రదర్శన తెలపాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు బాలయ్య, వెంకటేశం, తాజుద్దీన్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయమంటే..ఆరోపణలు చేస్తున్నారు

● గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ


విలేకరులతో మాట్లాడుతున్న అన్నపూర్ణ

గజ్వేల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా పనిచేయమంటే ఆరోపణలు చేస్తున్నారని గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఆర్ఎంవోలు రాము, ప్రతిమలతో కలసి ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. డిసెంబరులో డీసీహెచ్ఎస్‌గా చార్జ్ తీసుకున్నప్పటి నుంచి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేసున్నానని, మాతా శిశు ఆసుపత్రిని ప్రారంభించినట్లు తెలిపారు. కొన్నాళ్లుగా గజ్వేల్ ఆసుపత్రిలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వారిని వారి సొంత పోస్టింగ్‌లకు పంపిచామని, పనిచేయని వారిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించామని తెలిపారు. డిప్యూటేషన్లు క్యాన్సిల్ చేయడం, తొలగించడం, పనిచేయమంటే తనపై వ్యక్తిగత కక్ష పెట్టుకుని ఇబ్బందులు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. తనకు కులాన్ని ఆపాదిస్తున్నారని, ప్రతి శనివారం తాను ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయానికి, కమిషనర్ కార్యాలయానికి ఆసుపత్రి పనుల మీదే వెళ్తున్నామని తెలిపారు. రేడియాలజిస్టు విషయంలో కఠినంగా ఉంటామని, ప్రతి స్కానింగ్ ఆసుపత్రిలో జరిగేలా చూస్తామన్నారు. ప్రైవేట్‌కు రిఫరల్ చేసి తాను లబ్ధి పొందానన్న అంశం పూర్తిగా సత్యదూరమని తెలిపారు.

డీసీహెచ్ఎస్ పోస్టు నాకొద్దు !

● లిఖితపూర్వకంగా వద్దన్న డా.యాదగిరి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని టీవీవీపీ జిల్లా ఆస్పత్రుల ఇన్‌చార్జి సమన్వయకర్తగా(డీసీహెచ్ఎస్) డా.ఎస్.యాదగిరి బాధ్యతలు స్వీకరించేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 26 వ తేదీన డా.సంగారెడ్డిని డీసీహెచ్ఎస్ బాధ్యతల నుంచి తప్పించి సదాశివపేట సీహెచ్‌సీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న డా.ఎస్.యాదగిరిని నియమిస్తూ టీవీవీపీ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే డా.యాదగిరి డీసీహెచ్ఎస్‌గా చేరేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. కాగా డీసీహెచ్ఎస్ పోస్టు కోసం మరో సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ తన ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఒకట్రెండు రోజుల్లో డీసీహెచ్ఎస్ ఎవరనేది స్పష్టత వచ్చే అవకాశముందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

అంగన్‌వాడీ టీచర్, ఆయా తొలగింపు

శివ్వంపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రత్నాపూర్ అంగన్‌వాడీ సెంటర్‌లో ఇటీవల తాగునీటిలో ఎలుక పడిన ఘటనలో పలువురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఓ చిన్నారికి కడుపు ఉబ్బడంతో ఉన్నత అధికారులు చర్యలు తీసుకున్న ఘటన గురువారం రత్నాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐసీడీఎస్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి ఘటనకు బాధ్యులైన అంగన్‌వాడీ టీచర్ నవీన, ఆయా రాజమ్మను విధుల్లో నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు నర్సాపూర్ సీడీపీవో హేమ భార్గవి తెలిపారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడండి

● పంచాయతీ కార్యదర్శులకు డీపీవో ఆదేశం

మునిపల్లి, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని మొగ్దుంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డీపీవో సందర్శించి రికార్డులు, గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో మురికి కాలువలు ఎప్పటికప్పుడు తీయించాలని, నీరు నిల్వకుండా చూడాలని కార్యదర్శులకు సూచించారు. అలాగే నర్సరీల్లోని మొక్కలను హరిత వనానికి సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ విషయాల్లో కార్యదర్శులు నిర్లక్ష్యం చేయకుండా ప్రతి రోజు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. అంతకు ముందు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ డాక్టర్ హరినందన్ రావు, ఎంపీవో అండాలమ్మ, పంచాయతీ కార్యదర్శి నర్సింలు తదితరులు ఉన్నారు.

మంజీరా నదిలో మహిళ గల్లంతు


ప్రమీల (ఫైల్)

కొల్చారం, ఆగష్టు 28 (ఆంధ్రజ్యోతి): కొల్చారం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన మహిళ మంజీరా నదిలో గల్లంతు అయిన సంఘటన మండలంలో తుక్కాపూర్ గ్రామంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన టేక్మాల్ మల్లప్ప భార్య టేక్మాల్ ప్రమీల బయటకు వెళ్లొస్తానంటూ ఇంటి నుంచి వెళ్లింది. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వాళ్లను, బంధువులను అడిగినా ప్రమీల ఆచూకీ లభించలేదు. బుధవారం మంజీరా నది బ్రిడ్జి ఎడమవైపు ఒడ్డు పైన ప్రమీల వేసుకున్న చెప్పులు, నడుముకు నొప్పి కోసం వేసుకున్న బెల్టు కనిపించాయి. సింగూర్ నుంచి దిగువకు నీటిని వదలడంతో ఆప్రవాహంలో కొట్టుకుపోవచ్చు అన్న అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై హైమద్ మొహినొద్దీన్, తహసీల్దార్ శ్రీనివాస్ చారి ఎస్డీఆర్ బృందాలను రప్పించి ప్రమీల ఆచూకీ కోసం నదిలో వెతికించారు.

భార్యపై అలిగి భర్త అదృశ్యం


సాయిలు(ఫైల్)

పటాన్‌చెరు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబసమస్యల నేపథ్యంలో భార్యాభర్తలు గొడవ పడి భర్త అదృశ్యం అయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంద్రేశం మున్సిపల్ పరిధి రామేశ్వరంబండ గ్రామంలో నివాసం ఉంటున్న సాయిలు మంగళవారం ఉదయం భార్య స్వప్నతో గొడవ పడాడు. ఇద్దరూ కూలిపనికి వెళ్లి వచ్చిన తర్వాత సాయంత్రం భర్త బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల విచారించినా ఫలితం లేదు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

● అనాథలైన ముగ్గురు కుమార్తెలు


జంగం రజిత(ఫైల్)

మనోహరాబాద్, అగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గతంలో భర్త మరణించడంతో ముగ్గురు కూతుర్ల పోషణ భారమై చెరువులో దూకి ఓ ఇల్లాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల పరిధిలో జరిగింది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామానికి చెందిన జంగం నగేష్ రజితలకు ముగ్గురు కుమార్తెలు. రెండేళ్ల క్రితం నగేష్ గుండెపోటుతో మరణించారు. అప్పటి నుంచి కుమార్తెల పోషణ, రోజు రోజుకి తల్లి జంగం రజితకు భారం కావడంతో, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల బుధవారం గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో కుటుంబీకులు ఎక్కడ వెతికినా ఆచూకి లభించలేదు. బుధవారం రాత్రి పోలీసులకు మామ జంగం నర్సింలు ఫిర్యాదు చేశాడు. దీంతో ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్థులు చూసే సరికి చెరువులో నీటిపై తెలుతూ కనిపించింది. దీంతో వెంటనే గ్రామస్థులు ఒడ్డుకు చేర్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జహీరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సంగారెడ్డిజిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి గ్రామశివారులో 65వ నెంబర్ జాతీయరహదారిపై చోటు చేసుకుంది. జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. ఈ నెల 27 రాత్రి గుర్తుతెలియని వ్యక్తిని ఓ వాహనం ఢీకొనడంతో బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అన్నారు. మృతుడికి సంబంధించిన వారెవరైనా ఉంటే 8712661847, 8712656764, 8712656731 లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గుర్తుతెలియని మహిళ..

పటాన్‌చెరు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని మహిళను పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. 60 ఏళ్ల గుర్తుతెలియని మహిళ పటాన్‌చెరు యాక్సిస్ బ్యాంకు వద్ద పడి ఉండగా బుధవారం స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు

అప్పులబాధతో టెక్నీషియన్ ఆత్మహత్య

పటాన్‌చెరు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్న టెక్నీషియన్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామం సాయిప్రియకాలనీలో నివాసం ఉంటున్న జాకబ్(43) రుద్రారం గ్రామం తోషిబా పరిశ్రమలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక 15రోజులుగా డ్యూటీకి వెళ్లకుండా ఇంటివద్దే ఉండిపోయాడు. బయటకు వెళ్లిన సాయిలు తిరిగి రాలేదు. చిట్కుల్ మల్లన్న గుడి వెనుక వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

● డ్రైవర్ మృతి

ములుగు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం ములుగు సమీపంలోని హవేలీ ఫామ్స్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ బ్రేక్‌డౌన్ కావడంతో హవేలి ఫామ్స్ వద్ద ఆపాడు. గురువారం తెల్లవారుజామున ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఆగి ఉన్న లారిని ఢీకొట్టగా డ్రైవర్ శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


ఘనపురం ఆనకట్ట నుంచి ఉప్పొంగిన మంజీర


భూంపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న కూడవెల్లి వాగు


మాసాయిపేట మండలం ఉప్పులింగాపూర్‌లో బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న హల్దీవాగు

ఉప్పొంగిన వరద


పాపన్నపేట మండలంలోని ఎల్లాపూర్ వంతెనపై నుంచి పారుతున్న మంజీర


ఏడుపాయలలో

ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండురోజులుగా కురిసిన కుండపోత వర్షాలతో వరద నీరు హోరెత్తింది. వాగులు పొంగిపొర్లుతుండగా, చెరువులు అలుగులు దూకుతున్నాయి. కుంటలు, ఒర్రెలతో సహా ఎటుచూసిన జలసవ్వడి కనిపిస్తున్నది. హల్దీ వాగు ఉగ్రరూపం దాల్చగా, మంజీర నది ఉప్పొంగింది. కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది.

- న్యూస్ నెట్‌వర్క్


సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు అలుగుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద


కోహెడ మండలం బస్వాపూర్ గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మోయ తుమ్మెద వాగు


సిద్దిపేట తిప్పారబోయిన కాలనీ నుంచి బూరుగుపల్లికి వచ్చే రోడ్డుపై ప్రవహిస్తున్న చెరువు నీరు


చేర్యాల మండలం తాడూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


సిద్దిపేట కోమటిచెరువు పరవళ్లు



జహీరాబాద్ పరిధిలోని నారింజ ప్రాజెక్టు నుంచి దిగువకు పారుతున్న నీరు, మత్తడిపోస్తున్న బెజ్జంకి మండలం తోటపల్లి వరదకాలువ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్


తొగుట మండలం చందాపూర్ గ్రామ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

విద్యుత్ అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తాం

● సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం నాయకులు విద్యుత్ అమరులు విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి, రామకృష్ణల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 28 అప్పటి ప్రభుత్వం బషీర్‌బాగ్ వద్ద ముగ్గురు అమరులను కాల్చి చంపిందని, దీనిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తే ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేశారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించి గుణపాఠం చెబుతామని చుక్క రాములు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాణిక్యం, నర్సింలు, యాదగిరి, కృష్ణ, అశోక్, రాజయ్య, శివకుమార్, బాల్‌రాజ్, విఠల్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్‌పల్లి గ్రామంలో జపాన్ బృందం పర్యటన


ఉత్తర్‌పల్లిలో జపాన్ బృంద సభ్యులు

కంది, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ జీవన విధానం, గ్రామాల స్థితిగతులను తెలుసుకునేందుకు జపాన్ దేశానికి చెందిన సుజుకి సంస్థ బృంద సభ్యులు 30 మంది సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఉత్తర్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మురికి కాలువలు, రోడ్లు, పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్నప్పటికీ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడం, ఆరోగ్య ఉపకేంద్రం అందుబాటులో లేకపోవడంతో గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను వారు తెలుసుకున్నారు. ఇక్కడి జనాభా, ఏఏ పంటలు వేస్తారనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఉత్తర్‌పల్లి అభివృద్ధి కోసం తమ ఇన్నోవేషన్ సంస్థ ద్వారా సహాయం చేస్తామని పేర్కొన్నారు.

వర్షంలో సైతం.. యూరియా కోసం

రైతులకు తప్పని తిప్పలు


కొండపాకలో వర్షంలోనూ యూరియా కోసం బారులు తీరిన రైతులు


దుబ్బాకలో యూరియా కోసం వానలో రైతుల ఆందోళన

దుబ్బాక/మిరుదొడ్డి/నంగునూరు/కొండపాక/తొగుట/రాయపోలు/మనోహరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వర్షం దంచికొడుతున్నా ఒక్క బస్తా ఎరువు దక్కించుకునేందుకు రైతులకు బాధలు తప్పలేదు. సిద్దిపేట జిల్లాలో వినాయకచవితి రోజూ రైతులు ప్యాక్స్ కేంద్రాల వద్ద, ఫర్టిలైజర్ దుకాణాల ఎదుట బారులు తీరారు. దుబ్బాక వ్యవసాయ సహకార సంఘం వద్ద తెల్లవారుజాము నుంచే వరుస కట్టారు. పండుగైనా చిన్నపిల్లలు, వృద్ధులను సైతం తీసుకొచ్చి క్యూలో నిలబెట్టినా ఫలితం లేకుండా పోయింది. దాదాపు రెండు వేల మంది వరకు దుబ్బాక ఏఎంసీ వద్దకు చేరుకున్నారు. సుమారు 542 బస్తాలను పంపిణీ చేయగా, 275 మందికే అందాయి. వర్షంలోనూ ఇంటిల్లిపాది వచ్చి యూరియా కోసం పడిగాపులు కాచినా దొరకకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసేదేమీ లేక తిరిగివెళ్లిపోయి, గురువారం తెల్లవారుజామున యూరియా కోసం తిరిగి వ్యవసాయ సహకార సంఘం వద్దకు చేరారు. తీరా పంపిణీ చేయకపోవడంతో రైతులు శివాజీ చౌరస్తా వద్దకు చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. దుబ్బాక ఎస్ఐ కీర్తిరాజు వారిని సముదాయించారు. మిరుదొడ్డి రైతువేదిక వద్ద యూరియా టోకెన్ల కోసం రైతులు బారుల తీరారు. తోపులాటలు జరగకుండా పోలీసుల సమక్షంలో అందజేయాల్సి వచ్చింది. నంగునూరు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద తెల్లవారకముందు నుంచే రైతులు బారులు తీరారు. 500 బస్తాలే ఉండగా, వచ్చినంత వరకు సరఫరా చేస్తామని అధికారులు రైతులకు వివరించే ప్రయత్నం చేశారు. యూరియా ఇచ్చేంతవరకు కదిలేది లేదంటూ వ్యవసాయ శాఖ అధికారులను రైతులు అడ్డుకున్నారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పారు. వర్షం పడుతున్నా తొగుటలోని ఆగ్రోస్ కేంద్రం వద్దకు గురువారం పెద్దసంఖ్యలో రైతులు చేరుకున్నారు. 560 బస్తాలే ఉండగా, పోలీస్ పహారా మధ్య ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియాను పంపిణీ చేశారు. కొండపాక పీఏసీఎస్‌కు గురువారం యూరియా లోడ్ రాగా, విషయం తెలిసి వర్షంలో సైతం రైతులు అక్కడికి ఎక్కువ సంఖ్యలో చేరుకున్నారు. టోకెన్ల వారీగా రైతులకు యూరియా పంపిణీ చేయగా, సగంమందికి దక్కలేదు. రాయపోల్‌లోని ఆగ్రోస్ కేంద్రానికి 550 బస్తాల యూరియా లోడ్ రాగా, వానలో గంటల తరబడి వేచిఉన్న రైతులకు ఒక్కొక్కరికీ ఒక బస్తా పంపిణీ చేశారు. మెదక్ జిల్లా మనోహరాబాద్‌లోని రైతువేదిక వద్ద రైతులకు టోకెన్లను అందజేశారు. అక్కడి నుంచి మనోహరాబాద్ చౌరాస్తాకు వర్షంలోనే వెళ్లి యూరియా తీసుకునేందుకు బారులు తీరారు. అయితే, టోకెన్ల ఇచ్చిన అందరికీ యూరియా అందలేదు. టోకెన్ తీసుకుని ఉదయం నుంచి ఎరువు బస్తా కోసం ఎదురుచూస్తే అధికారులు స్టాక్ అయిపోయిందని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


రాయపోల్‌లో..

నంగునూరులో ఎగబడుతున్న రైతులు



జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు కొండపాక విద్యార్థి ఎంపిక

కొండపాక, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : కొండపాక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి పొడిమ్యాకల కిరణ్‌కుమార్‌యాదవ్ జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే పోటీల్లో కిరణ్ కుమార్ పాల్గొంటాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్‌నాయక్ తెలిపారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు దొమ్మాట జానకిరామ్‌రెడ్డి కిరణ్‌కుమార్‌కు రూ.పదివేల ఆర్థికసాయం అందించారని పేర్కొన్నారు.

జాతీయస్థాయి లేఖ రచన పోటీల్లో సిద్దిపేట విద్యార్థిని విజయం

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ మూడో సంవత్సరం విద్యార్థిని తిప్పనబోయిన రిబ్కా జాతీయస్థాయి లేఖ రచన పోటీలో విజేతగా నిలిచింది. వ్యవహారిక భాష ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం డీఆర్జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. 'యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై లేఖ రాసిన రిబ్కా ఉత్తమ లేఖ బహుమతి గెలుచుకుందని కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.


కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు సిద్దిపేట జిల్లా క్రీడాకారుల ఎంపిక

గజ్వేల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ తెలంగాణ కబడ్డీ చాంపియన్‌షిప్ లీగ్ పోటీలకు సిద్దిపేట జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్టాత్మక పోటీల్లో జిల్లాకు చెందిన వంశీకృష్ణ(రైట్ కార్నర్), సాయికుమార్ (లెఫ్ట్ కార్నర్) ఎంపికయ్యారని, భవిష్యత్తులో ప్రో కబడ్డీ పోటీల్లో సిద్దిపేట జిల్లా నుంచి క్రీడాకారులు పాల్గొనేలా శిక్షణ ఇస్తామని తెలిపారు.

డీసీఎం వాహనమే మండపం

వ్యాన్‌లో కొలువుదీరిన గణనాథుడు

గణేష్ చతుర్థికి వీధిలో స్టేజీ వేసి, పందిరి వేసి, అలంకరణ చేసి మండపాన్ని తీర్చిదిద్ది వినాయకుడిని ప్రతిష్టిస్తుంటాం.. కానీ, వర్షాల నేపథ్యంలో నర్సాపూర్ పట్టణంలోని భక్తులు మాత్రం వినూత్నంగా ఆలోచించారు. వాహనంలోనే గణనాథుడిని కొలువుదీర్చారు. వర్షానికి తడవకుండా, డీసీఎం వ్యాన్‌నే మండపంగా తీర్చిదిద్ది, విఘ్నేశ్వరుడిని ప్రతిష్టించి పూజలు చేయడం అందరినీ ఆకట్టుకుంటుంది. పట్టణంలో గాంధీ విగ్రహం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో వినాయకుడిని ప్రతీ ఏటా



ప్రతిష్టిస్తున్నారు. రెండురోజులుగా ఎడతెరపి లేని వర్షాలతో మండపం పనులు చేయడం కష్టంగా మారడంతో ఇలా డీసీఎం వాహనాన్నే మండపంగా మార్చి అందులోనే గణనాథుడని ఏర్పాటు చేశారు.

- నర్సాపూర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి)



కొలువుదీరిన గణనాథులు

అట్టహాసంగా ప్రారంభమైన గణేశ్ నవరాత్రోత్సవాలు



మోహినిపురలో 20 అడుగుల ఎత్తైన వినాయకుడి విగ్రహం



శంకర్ నగర్‌లో బొజ్జ గణపయ్య



బెజ్జంకి మండలం దాచారంలో కూర్మ వాహనంపై కొలువు దీరిన గణనాథుడు



దుబ్బాకలోని కేదారీశ్వరాలయంలోని గణనాథుడికి వేసిన లక్ష ఒత్తుల దండ

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా గణేష్ చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వర్షం కురుస్తున్నప్పటికీ, భక్తులు ఉత్సాహంగా గణపయ్యలను తమ మండపాల్లో ప్రతిష్ఠించి పూజలు చేశారు. జిల్లావ్యాప్తంగా 2,513 మండపాలకు అనుమతులు లభించాయని, ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. మోహినిపురలో 20 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రెస్‌క్లబ్, చేర్యాల వైశ్య భవన్ వంటి ప్రాంతాల్లో మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు సందేశం ఇచ్చారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు తూము వద్ద ఆరోగ్య గణపతిని ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బెజ్జంకి మండలంలో దాచారం గ్రామంలో కూర్మ వాహనంపై కొలువుదీరిన గణనాథుడు భక్తులను ఆకర్షించారు. చిన్నకోడూరు, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట, మిరుదొడ్డి, అక్బర్‌పేట, మద్దూరు, వర్గల్, గజ్వేల్ వంటి ప్రాంతాల్లోనూ గణేశ్ విగ్రహాలను నెలకొల్పారు. యువజన సంఘాలు, కాలనీ వాసులు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రానున్న తొమ్మిది రోజుల పాటు నవరాత్రుల పూజలు ఘనంగా కొనసాగనున్నాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

డెంగీ నిర్ధారణకు ర్యాపిడ్ టెస్టులు నిర్వహించాలి

● కలెక్టర్ హైమావతి

గజ్వేల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): డెంగీ నిర్ధారణకు ర్యాపిడ్ టెస్టులు నిర్వహించాలని కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిని, మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని గురువారం రాత్రి ఆమె తనిఖీ చేశారు. పలు రిజిస్టర్‌లను పరిశీలించిన ఆమె వైద్యులు గైర్హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులతో మాట్లాడి అందున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జ్వరాలతో వచ్చిన వారికి వెంటనే ర్యాపిడ్ టెస్టులు నిర్వహించాలన్నారు. మెడిసిన్ స్టోర్‌లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. మందులు పూర్తిగా అయిపోకముందే స్టాక్ తెప్పించుకోవాలని సూచించారు. కాలం చెల్లిన మందులు ఉండవద్దని, రెగ్యూలర్‌గా శానిటేషన్ చేయాలని సూచించారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సహజ ప్రసవాలు పెంచాలని, గర్భవతులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట డీఎంఅండ్‌హెచ్‌వో ధన్‌రాజ్, వైద్యాధికారులు ఉన్నారు.



గజ్వేల్ ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యుత్ పోరాట అమరవీరులకు ఘన నివాళి

చేర్యాల/సిద్దిపేట అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన వారి స్ఫూర్తితో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. గురువారం చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన వీరుల ప్రాణత్యాగ ఫలితంగా నేటికి విద్యుత్ చార్జీలు పెంచకుండా పాలకులు ఉచిత విద్యుత్ అందిస్తున్నారన్నారు. అలాగే సిద్దిపేటలో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ పోరాట అమరవీరులు విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ చిత్రపటాలకు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలస్వామి, తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శశిధర్, పార్టీ చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, కమిటీ సభ్యులు రవికుమార్, శిరీష, రవీందర్ రెడ్డి, సంజీవ్ కుమార్, పోలోజు శ్రీహరి, ముస్త్యాల ప్రభాకర్, ఎస్‌డీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



చేర్యాలలో విద్యుత్ పోరాట అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

బైరాన్‌పల్లి అమరవీరులకు...

మద్దూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నిజాం రజాకార్ల పోరాటంలో అసువులు బాసిన బైరాన్‌పల్లి అమరవీరులకు గ్రామస్థులు నివాళులర్పించారు. అమరవీరుల కుటుంబాలకు పింఛన్లు ఇవ్వాలని, గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని మాజీ సర్పంచ్ బర్మ రాజమల్లయ్య ఈ సందర్భంగా కోరారు.

దుబ్బాకలో అదనపు కలెక్టర్ ఆకస్మిక పర్యటన

దుబ్బాక, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలో అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా పర్యటించారు. ప్రభుత్వ ఆసుపత్రిని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను, రామసముద్రం చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ జిల్లాలోనే దుబ్బాక మున్సిపాలిటీ ఇందిరమ్మ ఇండ్లనిర్మాణంలో వెనకబడి ఉందని, నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదేశించారు. రామసముద్రం చెరువుతో ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ కళ్యాణ రమేష్, దుబ్బాక తహసీల్దార్ సంజీవ్ కుమార్ తదితరులు పాల్గోన్నారు.



దుబ్బాక ఆసుపత్రిలో సేవలపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

గజ్వేల్ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా మనివీర్

గజ్వేల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ న్యాయస్థానం అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా మనివీర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెనరాజ్ పాండరి ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి మూల స్వాతిగౌడ్, న్యాయవాదులు కాశీప్రసాద్, బాలముకుందరెడ్డి, పార్థసారధి, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, ప్రకాశ్, గఫార్, శ్రీనివాస్, అరవింద్ తదితరులున్నారు.



మనివీర్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

జల దిగ్బంధం

(5వ పేజీ తరువాయి)

పాఠశాల ఆవరణతో పాటు కడవేరుగు ప్రధాన రహదారి జలమయమైంది. చేర్యాల మండలంలోని గుర్జకుంట గ్రామానికి చెందిన దర్శనం నర్సమ్మ ఇంటి గోడ కూలింది. అలాగే దొమ్మాట, వేచరేణి తదితర గ్రామాల్లో పలు ఇళ్ల పైకప్పులు, గోడలు నేలకూలాయి. మిరుదొడ్డి మండలంలోని పలు గ్రామాల్లో మొత్తం 11 ఇళ్లు నేలాయి. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో మూడు ఇళ్లు కూలాయి. నంగునూరు మండలంలోని మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. నంగునూరు, ఘనపూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

నిండుకుండలా శనిగరం ప్రాజెక్టు

మోయ తుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో కోహెడ మండలంలోని శనిగరం ప్రాజెక్టు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. మండలంలోని బస్వాపూర్ ఫీడర్ ఛానల్ ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం ఒక టీఎంసీ కాగా ప్రాజెక్టు నీటి మట్టం 27 అడుగులకు గాను 26 అడుగుల నీరు చేరుకుంది.

పలు మండలాల్లో..

తొగుట మండలంలో భారీ వర్షం కురిసింది. చందాపూర్ - వెంకట్రావ్‌పేట, అదే విధంగా లింగంపేట, అల్వాల గ్రామానికి వెళ్లే రహదారిపై నుంచి కూడవెళ్లి వాగు ప్రమాదస్థాయిలో ప్రవహించడంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చందాపూర్, లింగాపూర్, వెంకట్రావ్‌పేట, జప్తిలింగారెడ్డిపల్లి గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ హైమావతి, సీపీ అనురాధ, సిద్దిపేట ఆర్డీవో సదానందం, గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, ఇరిగేషన్ శాఖ ఈఈ శిరీష, దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి పరిస్థితిని సమీక్షించారు. పలువురి ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రాయపోల్ మండల పరిషత్ కార్యాలయం ప్రైవేటు భవనంలో కొనసాగుతున్నది. వర్షాలకు కార్యాలయంలోని కంప్యూటర్ రూం ఉరుస్తుంది. దౌల్తాబాద్‌లో దెబ్బతిన్న రోడ్డు కల్వర్టులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. సింగాటంలో ముంపునకు గురైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రజల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సందర్శించారు. చేర్యాల పట్టణంలో వరదనీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి వరదనీటిలో నిలబడి నిరసన తెలిపారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీల్లో వరదలకు బడా నాయకుల ఆక్రమణలే కారణమని బీజేపీ పట్టణాధ్యక్షుడు మనోహర్ యాదవ్ ఆరోపించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నంగునూరు తహసీల్దార్ సరిత సూచించారు. పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులను పరిశీలించారు. వాగుల వద్ద ట్రాక్టర్లను అడ్డుగా పెట్టి రాకపోకలను నిలిపివేశారు. సిద్దిపేట పట్టణంలోని 23వ వార్డులో కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్ పర్యటించి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో లోలెవల్ కాజ్‌వే దెబ్బతినడంతో తహసీల్దార్ దివ్య పరిశీలించారు.

కొండపోచమ్మ ప్రధాన కాలువ ధ్వంసం

భారీ వర్షాల నేపథ్యంలో కొండపోచమ్మ సాగర్ ప్రధాన కాలువ ధ్వంసమైందని ఇరిగేషన్ ఏఈ సాయిరెడ్డి తెలిపారు.



జలదిగ్బంధంలో సిద్దిపేట పట్టణంలోని గోశాల

విద్యుత్ ఉద్యోగుల సాహసం

తొగుట మండలం వెంకట్రావ్‌పేట సమీపంలోని వనం చెరువు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభంపై ఉన్న ఇన్సులేటర్ వర్షాలకు చెడిపోయింది. గ్రామ శివారులో ఉన్న పౌల్ట్రీ ఫాంలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు మరమ్మతులు చేద్దామంటే చెరువు నిండు కుండలా ఉండడంతో అక్కడికి ఎలా వెళ్లాలని ఆలోచనలో పడ్డారు. విద్యుత్ సిబ్బంది మల్లేశం చేపలను పట్టడానికి ఉపయోగించే తెప్పతో గ్రామస్థుల సహాయంతో స్తంభం వద్దకు చేరుకున్నారు. అనంతరం స్తంభంపైకి ఎక్కి విద్యుత్ మరమ్మత్తులు చేపట్టారు. దాంతో విద్యుత్ సరఫరా కావడంతో గ్రామస్తులు, విద్యుత్ ఏఈ శ్రీధర్‌తో పాటు సిబ్బంది అతడిని అభినందించారు.

● మిరుదొడ్డి మండలంలో భారీ వర్షాలకు విద్యుత్ స్తంభం విరిగిపడటంతో తొమ్మిది గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కూలిపోయిన స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వారి సాహసాన్ని ప్రజలు అభినందించారు.





గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డులోని సబ్ స్టేషన్‌లో మోటర్ సాయంతో నీటిని తీసివేయిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

సిద్దిపేట రూరల్ /జగదేవ్‌పూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నామని సిద్దిపేట రూరల్ మండల వ్యవసాయ అధికారి నరేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద వీటిని అందజేస్తున్నదని తెలిపారు. మహిళల పేరు మీద భూమి కలిగి ఉండాలని, ట్రాక్టర్ ఆర్‌సీ మహిళ పేరు మీద కానీ, భర్త పేరు మీద ఉండాలని పేర్కొన్నారు. పవర్ స్ప్రేయర్స్-4, రోటో వేటర్స్-4, పవర్ వీడర్-1 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే జగదేవ్‌పూర్ మండలానికి మొత్తం 16 పనిముట్లు కేటాయించినట్లు మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు. అందులో 7 పవర్ స్ప్రేయర్లు, 7 రోటావేటర్లు, 2 బ్రష్ కట్టర్లు లేదా పవర్ వీడర్లు ఉంటాయన్నారు. అర్హులు దరఖాస్తు పత్రానికి భూమి పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ తదితర జిరాక్స్‌లు జత చేసి సంబంధిత అధికారులు అందజేయాలని పేర్కొన్నారు.

ఇసుక లారీ పట్టివేత



ఇసుక లారీని పట్టుకున్న ఎస్ఐ సైఫ్ అలీ, సిబ్బంది

చిన్నకోడూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక లారీని చిన్నకోడూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సైఫ్ అలీ కథనం ప్రకారం, బుధవారం చెర్లఅంకిరెడ్డిపల్లి స్టేజ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కోహెడ మండలం మోయ తుమ్మెద వాగు నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం మన్నారంకు చెందిన డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



రాజేశం (ఫైల్)

బెజ్జంకి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన రాగి రాజేశం (42) అదృశ్యమయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 26న ఇంట్లో నుంచి వెళ్లిన రాజేశం ఎంతకీ తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని కుమారుడు అజయ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

చేర్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. రైతు పత్యం బుచ్చయ్యకు చెందిన గేదె బుధవారం మేత మేస్తుండగా, విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. గేదె మృతితో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాల ప్రదర్శన

వర్గల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీలలో వార్డుల వారీగా ఓటరు, పోలింగ్ స్టేషన్ల జాబితాలు అందుబాటులో ఉంచామని గురువారం ఎంపీడీవో మచ్చేందర్ తెలిపారు. వాటిని పరిశీలించి ఆ జాబితాల్లో ఏమైనా సవరణలు, అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 30వ తేదీ లోగా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు.

'ఆరు గ్యారంటీలు అమలు చేయాలి'

ములుగు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు.

డిగ్రీ కళాశాల విద్యార్థినులకు వైద్య పరీక్షలు

వర్గల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వర్గల్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో వైద్య, ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఉమారాణి, హెల్త్ అసిస్టెంట్ పూజిత పాల్గొన్నారు



మద్దూరు సొసైటీ ఎదుట చర్చకు కూర్చున్న సీపీఎం నాయకులు

యూరియాపై చర్చకు రాని నేతలు

మద్దూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సొసైటీలో జరిగిన యూరియా బస్తాల అవినీతిపై చర్చకు వస్తానని సవాలు విసిరిన చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవనరెడ్డి రాకపోవడంపై సీపీఎం నాయకులు మండిపడ్డారు. రేబర్తి సొసైటీలో ఈ నెల 25న పంపిణీ చేసిన యూరియా బస్తాల్లో జీవనరెడ్డి రైతు పేరుతో 15 బస్తాలు తీసుకెళ్లారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి యాదగిరి ఆరోపించారు. సొసైటీకి 560 బస్తాలు వస్తే, 442 మాత్రమే రైతులకు ఇచ్చారని, మిగతా 118 బస్తాలు ఎక్కడికి వెళ్లాయని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులు కూడా హంగామా చేసి చర్చలో పాల్గొనకుండానే వెళ్లిపోయారని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండీ షఫి, సభ్యులు రమేష్, నరేష్, కనకరాజు, మురళి, మల్లేశం, నర్సిరెడ్డి, రాంరెడ్డి, బుచ్చిరెడ్డి, కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌రహిత సమాజం కోసం కృషి

● మంత్రి పొన్నం సతీమణి మంజుల



మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంకును అందజేస్తున్న పొన్నం మంజుల

అక్కన్నపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి ఐలయ్య, సింగిల్ విండో డైరెక్టర్ బండి కుమార్, మార్కెట్ డైరెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి'



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద ఈత మొక్కలు నాటుతున్న కమిషనర్ మల్లిఖార్జున్, గౌడ సంఘం నాయకులు

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున పిలుపునిచ్చారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఈత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల శ్రీకాంత్, ఎల్లమ్మ టెంపుల్ మాజీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ, కల్లుగీత కార్మిక సొసైటీ అధ్యక్షులు పూదరి వరప్రసాద్, పూదరి రవీందర్,నాయకులు పచ్చిమట్ల అంజయ్య, చంద్రమౌళి, లక్ష్మణ్‌గౌడ్, పెరుమాండ్ల నర్సాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బండి కుమార్, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



రాయపోల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. రాయపోల్‌లో వర్షంలో యూరియా కోసం రైతులు క్యూ కట్టడాన్ని తెలుసుకున్న ఆయన అక్కడికి చేరుకుని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కేసీఆర్ పాలనలో యూరియా కొరత లేకుండా చూసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి సరిపడా యూరియా తెప్పించకుండా ప్రకటనలకే పరిమితమైందని మండిపడ్డారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు రూ.25వేల పరిహారం ఇవ్వాలి

● బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, భారీ వర్షాలతో రైతులకు పంట నష్ట జరుగుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇళ్లు కూలిపోయిన వారికి వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. వర్షాల దృష్ట్యా రైతులకు సరిపడా యూరియా అందజేసే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ రాజమౌళి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మండల అధ్యక్షులు మధు, వెంకట్‌రెడ్డి, నాయకులు దేవి రవీందర్, ఊడెం కృష్ణారెడ్డి, ఖాజా విరాసత్‌అలీ, జుబేర్, రాంచంద్రం, రమేశ్, అమరేందర్, నాగరాజు, చందు, మర్కంటి కనకయ్య, శ్రీధర్, నర్సింగరావు తదితరులున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి